ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

● 962 మంది గైర్హాజరు



రైల్వేకోడూరు పరీక్షా కేంద్రంలోకి వెలుతున్న విద్యార్థులు

రాయచోటిటౌన్, మార్చి 18: జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాల్లో 23,536 మంది విద్యార్థులకు గానూ 22,574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 962 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షల సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల తదితర పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే పరీక్షల సందర్భంగా ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కొన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులను కూడా నిర్దేశించిన పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేపట్టి అక్కడున్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్, ఇన్విజిలేటర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరు అజ్మత్ బాషా

పీలేరు, మార్చి 18: ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండాలంటూ అటు రాష్ట్ర హైకోర్టు, ఇటు ఎన్నికల సంఘం పలుమార్లు హెచ్చరించినా పీలేరు మండలంలోని పలు వలంటీర్లకు చెవికెక్కినట్లు లేదు. పలువురు వలంటీర్లు ఎటువంటి భయం, బెరుకూ లేకుండా అధికార పార్టీ నేతలతో కలిసి దర్జాగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీకి చెందిన వలంటీర్లు సాయి, సతీశ్‌లు ఆదివారం రాత్రి తమ గ్రామంలో జరిగిన ప్రచారంలో అధికార పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా పీలేరు పట్టణానికి అజ్మత్‌బాషా అనే వలంటీరు సోమవారం పీలేరు పట్టణం కోటపల్లె ప్రాంతంలో జరిగిన ప్రచారంలో పాల్గొన్నాడు.

తాగునీటి బిల్లులు చెల్లించలేదని..
ఇంజనీరింగ్ కార్యాలయం గేటు మూత

● బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్ల నిరసన

మదనపల్లె, మార్చి 18: గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చిన ట్యాంకర్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు మరోసారి ఆందోళనకు దిగారు. మూడురోజుల క్రితం డివిజన్ స్థాయి గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కార్యాలయానికి తాళం వేసిన కాంట్రాక్టర్లు సోమవారం మదనపల్లె, తంబళ్లపల్లె డివిజన్లకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ కార్యాలయాల సముదాయాలకు వెళ్లే ప్రధాన గేటు మూసేసి అక్కడే కూర్చుని నిరసన తెలిపారు. మూడేళ్లయినా బిల్లులు చెల్లించలేదని, ట్యాంకర్లు, డీజిల్‌కు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకున్నామని బాధితులు వాపోయారు. ములకలచెరువు మండలానికి చెందిన పది మంది కాంట్రాక్టర్లు శనివారం నిరసన చేపట్టగా, సోమవారం పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి, కె.వి.పల్లె మండలాలకు చెందిన కాంట్రాక్టర్లతో పాటు తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్లు వచ్చి కార్యాలయం గేటుకు తాళం వేసి అక్కడే కూర్చుని నిరసన తెలిపారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.2 లక్షల నుంచి రూ.9 లక్షల వరకూ బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. ఇలా రెండు నియోజకవర్గాలకు కలిపి సుమారు రూ.5 కోట్ల వరకూ బకాయిలు ఉన్నట్లు బాధితులు వాపోయారు. అయితే నెలవారీ బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే, వారి ఖాతాలకు జమ కానున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు.



ఇంజనీరింగ్ ప్రధాన కార్యాలయం గేట్లు మూసేసి నిరసన తెలుపుతున్న నీటి ట్యాంకర్ల కాంట్రాక్టర్లు

ఒక్క అడుగూ పడలేదు..

● కడప-రేణిగుంట హైవే పనులు జరిగేదెప్పుడో...?

● 8 నెలల కిందట ప్రారంభించినా...

● ఎక్కడికక్కడే నిలిచిపోయిన పనులు

● పురోగతి లేని 123 కిలోమీటర్ల నాలుగు లేన్ల హైవే పనులు



నిత్యం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన కడప-రేణిగుంట రోడ్డు



కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా

రాజంపేట, మార్చి 18: ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ఎనిమిది నెలల కిందట ప్రారంభమైనా అనేక కారణాల వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు సాగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత ఏడాది ఆగస్టు ఆరంభంలో ఈ పనులకు శ్రీకారం చుట్టినా అవి ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఆగస్టు ఆరంభంలో ఎక్స్‌కవేటర్‌లు ఏర్పాటు చేసి హైవే ఏర్పాటయ్యే చోట కంపచెట్లు తొలగించారు తప్ప అనంతరం ఎటువంటి పనులు చేయలేదు. రోడ్డు వెళ్లే ప్రాంతంలో తీసిన కంపచెట్లు తిరిగి దట్టంగా అలుముకున్నాయి. ప్రస్తుతం కడప-రేణిగుంట వయా కోడూరు, రాజంపేట డబుల్ లేన్ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ పది వేల వాహనాలు వెళ్లే ఈ మార్గంలో నాలుగు లేన్ల రోడ్డు లేక వాహనదారులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే గత ఏడాది ఆగస్టు ఆరంభంలో పనులు ప్రారంభించేటప్పటికీ అందరూ ఈ రోడ్డును త్వరితగతిన పూర్తి చేస్తారని అనుకున్నారు. ఏమైందో ఏమో కానీ ఒక్కసారిగా ఈ పనులు జరగక నిలిచిపోవడంతో మళ్లీ ఎప్పుడు పనులు ప్రారంభిస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

123 కిలోమీటర్లు.. రూ.25254 కోట్లు

ఎన్‌హెచ్-716 గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సంబంధించి కడప-రేణిగుంట మార్గంలో ఫోర్ లేన్ రోడ్డు పనులకు రూ.2254 కోట్లకు టెండర్లు కూడా పూర్తి చేశారు. కడప నుంచి ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్లతో ఒక ప్యాకేజీ, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 59 కిలోమీటర్ల మేర రెండవ ప్యాకేజీ కింద రెండు దశల్లో రోడ్డు పనులు చేపట్టడానికి పనులు పూర్తి చేశారు. నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా త్వరితగతిన గమ్యస్థానానికి చేరడానికి పచ్చని చెట్ల మధ్య ఈ రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మార్గంలో 240 కల్వర్టులు, మూడు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, 72 మేజర్ అండర్‌పాస్ బ్రిడ్జిలు, 52కు పైబడి లైట్ వెహికల్ అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. నాలుగు లేన్ల రహదారిగా ప్రయాణికులకు ఆహ్లాదకరంగా ఉండేటట్లు పచ్చని చెట్లను ఏర్పాటు చేసి ఏ గ్రామంలోనూ ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల ఇబ్బందులు లేకుండా నీరు ప్రవహించే ప్రాంతాల్లో కల్వర్టులు, ప్రజలు వెళ్లడానికి అండర్‌బ్రిడ్జిలు, వాహనాలు వెళ్లడానికి కావాల్సిన బ్రిడ్జిలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తుండటం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ హైవేని ఏర్పాటు చేయాలని చేయాల్సి ఉంది. గత ఏడాది జనవరిలోనే ఈ రోడ్డుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యాయి. టెండర్లను దక్కించుకున్న విజయవాడకు చెందిన లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ పనులు పూర్తి చేయాలి. రోడ్డుకు కావాల్సిన భూమిని సేకరించడం, సేకరించిన భూమికి 80 శాతం మంది రైతులకు నష్టపరిహారం అందజేయడం, మిగిలిన 20 శాతం మంది రైతులకు వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న భూసమస్యకు సంబంధించి సమస్యను పరిష్కరించి వారికి కూడా నష్టపరిహారం అందజేయడం యుద్ధప్రాతిపదికన జరిగింది. కానీ ఎందుకనో రోడ్ల పనులను ప్రారంభించలేదు. మామూలుగా ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల రహదారికి అల్లంతదూరంలో రైల్వేలైన్లకు సుమారు ఆయా ప్రాంతాలను బట్టి కిలోమీటరు నుంచి మూడు కిలోమీటర్ల వెడల్పు పైభాగాన ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాల్సి ఉంది.

నివాస ప్రాంతాలకు దూరంగా, పంట పొలాలు, కొండ ప్రాంతాలు, శేషాచలం అటవీ ప్రాంతాల గుండా ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలి. 123 కిలోమీటర్ల మేర ఏర్పాటయ్యే ఎన్‌హెచ్-716 నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ఇటు రాజంపేట, అటు రైల్వేకోడూరు, అటు నందలూరు, ఒంటిమిట్ట, ఓబులవారిపల్లె, పుల్లంపేట ప్రధాన కూడళ్లకు హైవే రోడ్డుకు అనుసంధానంగా ప్రత్యేక రోడ్లు ఏర్పాటు చేయాలి. రాజంపేట నుంచి రెండు కిలోమీటర్ల పరిధిలోని కూచివారిపల్లె నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్లడానికి ప్రస్తుతమున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా రాయచోటికి వెళ్లే మార్గం గుండా ఈ జంక్షన్ రోడ్డును ఏర్పాటు చేయాలి. కోడూరు, ఇతర మండలాలకు ఇతర గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా ఈ హైవే రోడ్డు మీదుగా వెళ్లడానికి అనుసంధానంగా రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలుసుకునేందుకు సంబంధిత అధికారుల కోసం ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.



గత ఏడాది ఆగస్టులో హైవే రోడ్డు కోసం కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

పనులు వెంటనే ప్రారంభించాలి..



ఎన్నో దశాబ్దాలుగా నాలుగు లేన్ల రహదారి కోసం రాజంపేట, కోడూరు ప్రజలు ఎదురు చూస్తున్నారు. కానీ ఎందుకనో పనులను ప్రారంభించ లేదు. ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రెండు లేన్ల రోడ్డు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. కడప నుంచి తిరుపతికి వెళ్లాలంటే నాలుగు గంటల సమయం పడుతుంది. రెండు లేన్ల రోడ్డు ఉండటం వల్ల రోజూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభించినా ఇంతవరకు అవి రూపుదాల్చలేదు. నిధులు విడుదల కాకనో.. లేక అధికారుల అలసత్వమో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో తెలియడం లేదు. అధికారులు స్పందించి ఇకనైనా పనులు ప్రారంభించాలి.

- రమణారెడ్డి, కౌన్సిలర్, రాజంపేట

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..



కేంద్ర ప్రభుత్వం వెంటనే కడప-రేణిగుంట హైవే పనుల విషయంలో జోక్యం చేసుకుని వెంటనే పనులు ప్రారంభించాలి. ప్రస్తుతం ఉన్న రోడ్డులో ప్రతిరోజూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించలేదు. గత ఏడాది ఆగస్టులో కంపచెట్లను కొన్ని చోట్ల తొలగించారు తప్ప ఏ పనులూ చేయలేదు. తొలగించిన కంపచెట్ల స్థానంలో తిరిగి చెట్లు పెరిగిపోయాయి. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల అధికారులు సమన్వయంతో ఈ రోడ్డు మార్గంపై దృష్టి పెట్టాల్సి ఉంది.

- పోతుగుంట రమేశ్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట

రాజంపేట, కోడూరు ప్రాంతీయుల పట్ల శీతకన్ను..



రాజంపేట, కోడూరు ప్రాంతీయుల పట్ల ప్రభుత్వం శీతకన్ను చూపుతుందనడానికి హైవే రోడ్డు పనులే ఉదాహరణ. ఎనుములు, ఆవులు, మేకలు తిరిగే ఇడుపులపాయ అటవీ మార్గానికి కూడా పదేళ్ల కిందట నాలుగు లేన్ల రోడ్లు వేశారు. అవసరం లేని చోట్లల్లా పులివెందుల ప్రాంతంలో నాలుగు లేన్ల రోడ్డు వేశారు. అదే నిత్యం పదివేల వాహనాలు తిరిగే రాజంపేట, కోడూరు మార్గంలో నాలుగు లేన్ల రోడ్డు వేయకుండా ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఇలా జరుగుతోంది. ఇక ఎన్నికల సమయంలో ఈ రోడ్డు గురించి పట్టించుకునే వారు ఉండరు. ఎనిమిది నెలల కిందట ప్రారంభించిన ఈ రోడ్డు పనులు ఇంత వరకు ముందుకు సాగకపోవడం చాలా బాధాకరమైన విషయం.

- కొల్లు రెడ్డెయ్యనాయుడు, రాజంపేట టీడీపీ నాయకులు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ క్రిష్ణారావు



రాయచోటిలో పోలీసులు చేపట్టిన కవాతులో కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, తదితరులు

రాయచోటిటౌన్, మార్చి 18: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజల భద్రత, భరోసా కోసమే పోలీసులతో కవాతు చేపట్టామని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ క్రిష్ణారావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా సోమవారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కలెక్టర్, ఎస్పీ రాయచోటి పట్టణంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, రాయచోటి డీఎస్పీ సయ్యద్ మహబూబ్‌బాషా, అర్బన్, రూరల్ సీఐలు సుధాకర్‌రెడ్డి, తులసీరామ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక ఎస్ఎస్‌బీ కేంద్ర సాయుధ బలగాలు రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు శివాలయం సర్కిల్ నుంచి మదనపల్లె రోడ్డు, కొత్తపేట, జగదాంబ సెంటర్, బస్టాండు, పాతరాయచోటి, మార్కెట్, గాంధీ బజార్, ఠాణా, రవి హాల్, రాజుల కాలనీ, కొత్తపల్లె, మాసాపేట మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల్లో భయం పోగొట్టి భరోసా కల్పించేందుకు ఎటువంటి అల్లర్లు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు.

ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే కాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా శాంతిభద్రతలను కాపాడడానికి సాయుధ బలగాలతో పాటు సాయుధ పోలీసులు అందరికీ అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకొనేలా జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.

కోడ్ ఉల్లంఘన

● ఎన్నికల కోడ్‌లోనూ ఏపీఎండీసీలో ఉద్యోగుల నియామకం..?

● 11 మంది స్థానికేతరులకు ఉద్యోగాలు


ఓబులవారిపల్లె, మార్చి 18: మంగంపేటలోని ఏపీఎండీసీ ఉద్యోగులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి 11 మందిని అక్రమంగా ఉద్యోగాల్లో నియమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన రోజు 8 మందిని నియమించగా అందులో ఆరుగురిని కాంట్రాక్టు ఉద్యోలుగా, ఇద్దరిని అవుట్ సోర్సింగ్ కింద తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగ నియామకాలు చేసిన వారికి పాత తేదీలతో ఎంపిక ప్రక్రియ జరిగినట్టు, ఎన్నికల కోడ్ అమలు జరిగిన రోజు వారు ఉద్యోగాల్లో చేరినట్లు తెలిసింది. గతంలో ఉద్యోగం నుంచి తొలగించిన వారికి సైతం ఈ నియామకాల్లో చోటు ఇచ్చినట్లు తెలిసింది. ఉద్యోగాలు పొందిన 8 మందిలో ఒకరు ఇద్దరికి తప్ప మిగిలిన వారికి ఇంకా అగ్రిమెంటు కూడా కానట్లు తెలుస్తోంది. వారు కాకుండా మరో ముగ్గురిని సోమవారం డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాల్లోకి తీసుకున్న వారంతా కూడా స్థానికేతరులేనని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న మంగంపేట డేంజర్ జోన్ గ్రామాలైన కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామ ప్రజలు ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ కోసం అన్నీ కోల్పోయిన తమకు నష్టపరిహారం, ప్యాకేజీ, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వమని వేడుకుంటున్నా ఏపీఎండీసీ యాజమాన్యం పట్టించుకోకుండా స్థానికేతరులైన వీరికి ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయండి అని అడిగితే మొండి చెయ్యి చూపుతూ బయట ప్రాంతాల వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అభివృద్ధికి సర్వస్వం వదులుకుని ఇబ్బందులు పడుతున్న డేంజర్‌జోన్ గ్రామస్థులకు న్యాయం చెయ్యకుండా స్థానికేతరులకు, పక్క జిల్లాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ఏపీఎండీసీ అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు సీపీవో సుదర్శన్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించినా, వాట్సప్ మెసేజ్ పెట్టినా స్పందించలేదు.

రేపు గాలివీడుకు నారా భువనేశ్వరి రాక



గాలివీడు, మార్చి 18: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 20వ తేదీ బుధవారం గాలివీడు మండలానికి వస్తున్నారని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును భరించలేక రాష్ట్రంలో చాలామంది మరణించారు. అందులో భాగంగా గాలివీడు మండలం ఎగువగొట్టివీడు మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు భార్య రెడ్డెమ్మ చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించింది. చంద్రబా బు అక్రమ అరెస్టుతో బాధపడుతూ మరణించిన కుటుంబ సభ్యులను భువనేశ్వరి కొంతకాలంగా పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు గాలివీడు మండలంలోని ఎగువగొట్టివీడులోని రెడ్డెమ్మ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తనిఖీల్లో పట్టుబడ్డ 31 కిలోల వెండి



పట్టుబడ్డ వెండి వస్తువులు

పీలేరు, మార్చి 18: పీలేరులో సోమవారం ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో 31 కిలోల వెండిని పట్టుకుంది. ఎటువంటి బిల్లులు, రశీదులు లేకుండా చెన్నై నుంచి కర్నూలుకు రవాణా అవుతున్న వెండిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. పీలేరు మండలంలోని దుర్గంవారిపల్లె టోల్‌ప్లాజా వద్ద ఈ సంఘటన జరిగింది. ఎన్నికల విధుల్లో భాగంగా పీలేరు ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్ యాదవ్ నేతృత్వంలో అధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. తమ విధి నిర్వహణలో భాగంగా వారు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చెన్నై నుంచి కర్నూలుకు గోపీ అనే వ్యక్తి వద్ద రూ.22 లక్షల విలువజేసే 31 కేజీల వెండి కాళ్ల పట్టీలు కనుగొన్నారు.

అతను వాటికి సంబంధించిన బిల్లులు, రశీదులు చూపకపోవడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దారు మహబూబ్‌బాషా ద్వారా జీఎస్టీ అధికారులకు తెలియజేశారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం వాటిని పీలేరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అప్పగించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో పట్టుబడ్డ వెండిపై జీఎస్టీ అధికారులు విచారణ ప్రారంభించారు.




వామ్మో చిలుక..

● తెర మీదకు కొత్తరకం సైబర్ క్రైం ● ఆశపడి లింక్ ఓపెన్ చేస్తే నగదు గల్లంతే

● సుండుపల్లెలో పది మందికి పైగా బాధితులు

సుండుపల్లె, మార్చి 18: వామ్మో చిలుక... చిలుకే కదా అని ముట్టుకున్నారా మీ ఖాతాలో నగదు గల్లంతే. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలను సైబర్ నేరగాళ్లు ఆదాయ మార్గంగా మలుచుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లు చిలుక పేరుతో కొత్తరకం మోసానికి తెరలేపారు. ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ ఫొటో పెట్టి ప్రజల ఖాతాలకు గండికొడుతున్నారు. ప్రసార మాధ్యమాల్లో ఒక లింకును పంపించి ఆ లింకు ద్వారా ప్రజల ఖాతాల్లో ఉండే నగదును కొల్లగొడుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. లింకును ఓపెన్ చేస్తే పంజరంలో దాగి ఉన్న చిలుక ప్రత్యక్షం అవుతుంది. ఆ చిలుకను నొక్కమని, అలా నొక్కితే ప్రధాని మీ అకౌంట్‌లో నగదు వేస్తారని ఆశ చూపుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. చిలుకను నొక్కిన వెంటనే ఒక యాప్ ఓపెన్ అవుతుంది. ఆ యాప్ గికితే మీకు పంపిన నగదు ప్రత్యక్షం అవుతుందని ఆ యాప్ ఆశ చూపుతోంది. ఈ విధంగా చేశామా అక్కడ ఎంత నగదు అయితే ప్రత్యక్షం అవుతుందో ఆ నగదు మన అకౌంట్‌లో మాయమవుతుందని బాధితులు చెబుతున్నారు. సైబర్ నేరస్తులు ఏకంగా భారత ప్రధాని ఫొటోను వాడుకుని ప్రజలను మోసం చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ విధంగా సుండుపల్లె మండలంలో పది మంది బాధితులయ్యారు. తెలియకుండా ఇంకా ఎంతమంది చిలుకను నమ్మి ఖాతాలో నగదును పోగొట్టుకున్నారో తెలియాల్సి ఉంది. ఈ విధమైన యాప్‌లను నమ్మి ఉచితంగా డబ్బులు పొందాలని ఆశపడితే నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి.



అకౌంట్‌లో డబ్బు కట్ అయినట్లు వచ్చిన సందేశం

ఎటువంటి యాప్‌లను నమ్మొద్దు..

అనధికారికంగా ప్రసార మాధ్యమాల్లో వచ్చే ఎటువంటి యాప్‌లను ప్రజలు నమ్మకండి. అనేక రకాల యాప్‌ల ద్వారా మోసం చేసే సైబర్ నేరగాళ్లు ఎక్కువ అయిపోతున్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడమే లక్ష్యంగా ఇటువంటి యాప్‌లను తెరమీదికి తెస్తుంటారు. ప్రజలు జాగ్రత్తగా ఉండండి. ఎవరికీ మీ పాస్‌వర్డ్‌లు చెప్పవద్దు.

- ఎస్‌కేఎం హుస్సేన్, ఎస్ఐ, సుండుపల్లె



అకౌంట్‌లో రూ.4998 గల్లంతు..



ఫేస్‌బుక్‌లో వచ్చిన ఈ లింక్ నొక్కితే మీ అకౌంట్‌లో నగదు జమ అవుతుంది అని రావడంతో దానిని నొక్కాను, ఓపెన్ అయిన తరువాత చిలుక కనిపించింది. ఆ లింక్ ఏ విధంగా అయితే ప్రారంభించమని చెప్పిందో అదే విధంగా చేశాను. నా అకౌంట్‌లో రూ.4998 జమ అవుతుందని చిలుక మెసేజ్ ఉంది. నా అకౌంట్‌లో పడుతుందని ఆశ పడ్డాను. నిమిషాల వ్యవధిలో నా అకౌంట్‌లో నగదు గల్లంతు అయినట్లు సెల్‌కు మెసేజ్ వచ్చింది. ఈ విధంగా నేను నష్టపోయాను.

- గంగిరెడ్డి, బాధితుడు, గంగిరెడ్డిగారిపల్లె

ప్రశ్నార్థకంగా చెత్త సంపద కేంద్రాలు

- రాబడి తక్కువ... ఖర్చులు ఎక్కువ
- భారంగా మారిన నిర్వహణ
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

సంబేపల్లె, మార్చి 18: గత ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామ పంచాయతీ ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించింది. ఒక్కో కేంద్రానికి రూ.8 నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేసి మండలంలో సరాసరి 15 నుంచి 20 కేంద్రాలు నిర్మించారు. నాడప్ కంపోస్టుల ద్వారా చెత్త నుంచి ఎరువులను తయారు చేసి రైతులు పంట సాగులో రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడుకునే విధంగా గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచాలనుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ చేపట్టి తద్వారా సంపదను సృష్టించవచ్చని భావించారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సంపద కేంద్రాల కోసం సుమారు 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. పథకం ఉద్దేశ్యం మాత్రం గొప్పది అయినా.. ప్రస్తుత ప్రభుత్వం ఈ కేంద్రాల బాగోగులు పట్టించుకోకపోవడంతో లక్ష్యం నీరు గారిందనే చెప్పవచ్చు.



పిచ్చిమొక్కలు మొలిచిన నాడప్ కంపోస్టు పిట్

సక్రమంగా సాగని చెత్త సేకరణ

సంబేపల్లె మండలంలో 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. 34 మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలిస్తారు. అక్కడ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ఇనుప వస్తువులు ఇలా వేరు వేరుగా వేరు చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండల వ్యాప్తంగా చెత్త సేకరణ చాలా గ్రామాల్లో జరగడం లేదు. చెత్త నుంచి వేరు చేసిన ప్లాస్టిక్, గాజు సీసాలు, ప్లాస్టిక్ ద్వారా నెలకు కొన్ని కేంద్రాల్లో రూ.200 మరి కొన్ని కేంద్రాల్లో రూ.500 నుంచి రూ.1500 వరకు ఆదాయం వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో 34 మంది గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రెండు లక్షల రూపాయలు జీతాల ద్వారా చెల్లించాలి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం వేలల్లో ఉంది. దీంతో రాబడి తక్కువ ఖర్చులు ఎక్కువ కావడంతో ఈ కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారింది.



చెత్త సంపద తయారీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అరలు



చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రం

నాడప్ కంపోస్ట్ పిట్‌లో పిచ్చిమొక్కలు

పంచాయతీ పరిధిలోని ఒక్కో హ్యాబిటేషన్‌లో ఒక రైతుకు నాడప్ కంపోస్టు పిట్ కోసం 12 వేల రూపాయలు అంచనాతో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా వీటిని నిర్మించారు. అయితే ఎక్కడా కంపోస్టు ఎరువులు మాత్రం తయారు చేయడం లేదు. పిచ్చిమొక్కలు మాత్రం కనిపిస్తున్నాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా వదిలేశారు.

అసంపూర్తిగా వదిలేశారు....

మండల వ్యాప్తంగా 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. శెట్టిపల్లి గ్రామంలో గాండ్లపల్లి వద్ద ఇప్పటికీ పిల్లర్ దశలో నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల గదులు నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పుడైనా అధికారులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పూర్తి స్థాయిలో జరగడం లేదు

మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో జరగడం లేదు. కొన్ని చోట్ల సేకరణ ద్వారా ప్లాస్టిక్, ఇనుము, గాజు సీసాలు, గుజిలీకి అమ్మడం ద్వారా కొంత ఆదాయం వస్తుంది. సేంద్రియ ఎరువు మాత్రం తయారు కావడం లేదు.

-రవీంద్ర, ఈవోపీఆర్‌డీ, సంబేపల్లె మండలం

సమాజ అవసరాలను తీర్చేలా విద్యావిధానం

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : జాతీయ విద్యావిధానం 2020 ద్వారా సమాజ అవసరాలను తీర్చేలా విద్యావిధానం రూపొందించారని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. సోమవారం యునిసెఫ్, వైవీయూ, ఏపీ ఉన్నత విద్యామండలి ఓట్ ఫర్ కమ్యూనిటీ డెవల్‌మెంటు త్రూ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటు ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలు అందుకునేలా, సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపేలా కరికులం ఉందన్నారు. విద్యార్థులు సమాజంలో ఒక భాగమని, వారి వారి ప్రాజెక్టుల్లో భాగంగా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. వీలైతే పరిష్కార మార్గాలు కూడా చూపాలన్నారు. దేశాభివృద్ధికి ఆటంకాలుగా మారిన సామాజిక రుగ్మతలన తొలగించే దిశగా అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, యునిసెఫ్ కన్సల్టెంట్ స్వాతి, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజరు ఎ.అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిగ్రీకళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనాభిరుచి అనువణువునా నిలుపుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : పరిశోధనాభిరుచి గల స్కాలర్లే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయగలరని వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. సోమవారం వైవీయూ డిపార్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో సామాజిక శాస్త్ర పరిశోధకుల కోసం పరిశోధనా పద్ధతి ఏకవిశ్లేషణ అంశంపై అతిధి ఉపన్యాసం చేశారు. ఎకనామిక్స్ శాఖ విభాగాధిపతి ప్రొఫెసరు అనిత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ స్కాలర్లు యాంత్రికంగా కాకుండా ఒక నిబద్ధతతో పరిశోధనలు సాగించాలన్నారు. అలా చేసినప్పుడే ఉత్త మ ఆవిష్కరణలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పరిశోధనపత్రాలు ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితం కావాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య బెంగుళూరు సెంటర్ ఆఫ్ ఎకనామిక్స్ స్టడీస్ అండ్ పాలసీ ఇనిస్టిట్యూట్ ఫర్‌సోషల్ అండ్ ఎకనామిక్స్ ప్రొఫెసరు డీన్ క్రిష్ణరాజ్ సామాజికశాస్త్ర పరిశోధకులు పరిశోధన పద్ధతి ఏకవిశ్లేషణ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, గణేశ్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నాన్న చేతిలో బాలుడు దారుణ హత్య



మృతి చెందిన బాలుడు రెడ్డిబాబు

పులివెందుల రూరల్, మార్చి 18: పులివెందుల పట్టణంలో ఓ బాలుడు తన చిన్నాన్న చేతిలో దారుణ హత్యకు గురయ్యా డు. తల్లి అనురాదదేవి ఫిర్యాదు మేరకు సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నగరిగుట్టలో అనురాదదేవి ఆమె కుమారుడు రెడ్డిబాబు (15) నివాసముండేవారు. వారి ఇంటి పక్కనే రెడ్డిబాబు చిన్నాన్న సురేష్ ఉండేవాడు. ఇతని మానసిక స్థితి సరిగా లేని కారణంగా రెడ్డిబాబు కుటుంబమే అతనికి భోజనం అందించేది. సురేష్‌కు పెళ్లి కాలేదు. రెడ్డిబాబు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటూ ఉదయం పేపర్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం ఉదయం తల్లి అనురాదదేవి తమ కుమార్తె అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. ఇంటికి వచ్చే సరికి అపస్మారకస్థితిలో పడి ఉన్న రెడ్డిబాబును చూసిన తల్లి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యు లు నిర్ధారించారు. బాలుడి చిన్నాన్న పరారీలో ఉన్నాడు. బాలుడి చిన్నాన్న సురేష్ తమ బిడ్డను హత్య చేశాడని తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజంపేట పట్టణంలో చోరీ

- 25 గ్రాములు బంగారు, రూ.12 వేలు నగదు చోరీ

రాజంపేటటౌన్, మార్చి 18: రాజంపేట పట్టణ, మండల పరిధిలో గత కొన్ని రోజులుగా ఎక్కడపడితే అక్కడ దొంగలు మాటువేసి ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని ఉస్మాన్ నగర్‌లో ఆలియా అనే మహిళ ఇంటిలో చోరీకి పాల్ప డ్డారు. 25 గ్రాముల బంగారు, రూ.12 వేల నగదు చోరీ చేశారు. ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఇంటిలోకి చొరబడి తలుపు పగలగొట్టి బీరువా, కబోర్డులలో వస్తువులను చెల్లాచెదురు చేసి అందులో ఉన్న నగదు, బంగారు చోరీ చేసినట్లు బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

పదో తరగతి విద్యార్థిని మృతి



రాజుపాలెం, మార్చి 18: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన శ్రీపతి లిఖిత (15) అనే పదో తరగతి విద్యార్థిని అకస్మాత్తుగా మృతి చెందింది. లిఖిత ఉదయం జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి తెలుగు పరీక్షకు హాజరైంది. పరీక్ష రాసి వచ్చిన తరువాత భోజనం ముగించుకుని పాఠశాలకు వెళ్లి మరో పరీక్షకు ప్రిపేర్‌వుతున్న సమయంలో విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థినిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా బాలిక మృతి చెందింది. లిఖిత గత కొన్నేళ్లుగా గుండెకు సంబంధించి వ్యాధితో బాధపడుతున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. బాలిక మృతితో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై ఘర్షణ

జమ్మలమడుగు, మార్చి 18: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పెన్నానది వంతెన వద్ద ఆదివారం రాత్రి సుమారు 12.30 గంటల ప్రాంతంలో వంతెన కింద సుమారు 10 మంది గొడవపడినట్లుగా తెలుస్తోంది. ప్రతిరోజు పగలు, రాత్రి పెన్నానది వంతెన సమీపాన గూడెం చెరువు, పొన్నతోట ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అయితే కొందరు ఇసుక ట్రాక్టర్లు పట్టించారని, మరికొందరు బయటి వ్యక్తులకు సమాచారం ఇస్తున్నారని తదితర కారణాలతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. రెడ్డప్ప అనే వ్యక్తి గతంలో ఎస్‌ఈబీ సీఐ వద్ద డ్రైవర్‌గా పనిచేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ట్రాక్టర్ పెట్టుకుని ఇసుక రవాణా చేస్తున్నాడు. ఆయనతోపాటు మరికొందరు పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందే ఏమో కానీ శివ, రెడ్డప్ప అనే వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరితో మరికొందరు గొడవ పడినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు వారిద్దరిని అదుపు లోకి తీసుకుని.. ఘటనపై విచారణ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఉమామహేశ్వరి మృతదేహం

పెనుకొండ రూరల్, మార్చి 18 : శ్రీసత్యసాయి జిల్లా మండల పరిధిలోని అమ్మవారిపల్లి సమీపంలో కోటక్ కంపెనీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమామహేశ్వరి(34) మృతి చెందగా, కుటుంబ సభ్యులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కడప జిల్లా జమ్ములమడుగు పట్టణానికి చెందిన మురళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన, భార్య ఉమామహేశ్వరి కొన్నేళ్ల కిందట బెంగళూరులోనే ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారు. వారికి ఇద్దరు పిల్లలు. వారు మూడు రోజుల కిందట కారులో హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త మురళి, కుమారుడు చైతన్య, కుమార్తె శ్రీనిధి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం

ఐదుగురిపై ఫోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 18: ప్రొద్దుటూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన లింగం కిరణ్ అనే వ్యక్తి 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్ప డ్డాడు. ఈ ఘటనపై బాలిక కుటుంబసభ్యులు ప్రొద్దుటూరు రూరల్ పోలీ సులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాలికపై అత్యాచారానికి కిరణ్‌అతని బంధువులు సహకరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కిరణ్‌తో పాటు మరో నలుగురుపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఈవీయం గోడౌన్ వద్ద నిరంతరం నిఘా ఉండాలి



మాసాపేట మార్కెట్ యార్డులో గోడౌన్‌లో ఈవీయంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, మార్చి 18: ఈవీయంలు భద్రపర్చిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డులో ఉన్న ఈవీయం గోడౌన్‌ను ఎస్పీ కృష్ణారావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 4893 బీయూలు, 4220 సీయూలు, 4847 వీవీ ప్యాట్‌లు వచ్చాయని, వీటన్నింటినీ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవీయం గోడౌన్‌కు సంబంధించిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు చెవులకు విజయవంతంగా ఆపరేషన్

- రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా చేశాం
- తిరుమల హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సురేంద్రబాబు వెల్లడి



శస్త్రచికిత్స పొందిన చిన్నారులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18: కడప నగరంలోని తిరుమల హాస్పిటల్‌లో ఒకేరోజు ఒకేసారి ఎస్.అబ్దుల్‌హబీబ్ (3) అనే చిన్నారికి రెండు చెవులకు బైనారల్ కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు తిరుమల హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సురేంద్రబాబు వెల్లడించారు. సోమవారం తిరుమల హాస్పిల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుల్లంపేటకు చెందిన ఎస్.అబ్దుల్‌వాహబ్ రేష్మా కుమారుడైన అబ్దుల్ హబీబ్‌కు పుట్టుకతోనే చెవిటి, మూగ. ఆ చిన్నారికి మా హాస్పిటల్‌లో ఒకేసారి రెండుచెవులకు నిర్వహించిన కాక్ క్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. సాధారణంగా కాక్లియర్ ఇంప్లాంట్‌సర్జరీ పిల్లలకు మూడేళ్లలోపు ఉంటే ముందుగా ఒక చెవికి చేయడం జరుగుతుందన్నారు. తదుపరి కొంత కాలం వ్యవధి తీసుకుని రెండోచెవికి సర్జరీ చేస్తారని తెలిపారు. ఇలా చేయడాన్ని సీక్వెన్షియల్ బైనారల్ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ అంటారన్నారు. అయితే ఒకేసారి రెండుచెవులకు కాక్ క్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసి విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. సర్జరీ విజయవంతం కావడంలో అనస్తీషియా స్పెషలిస్టు డాక్టర్ రాఘవేంద్ర సహకించారన్నారు. అలాగే ప్రవల్లిక (4) అనే చిన్నారికి ఒక చెవికి సర్జరీ జయప్రదంగా చేసినట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇరువురు చిన్నారులకు ఉచితంగా సర్జరీ నిర్వహించామని డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు.

ట్యూబ్ లీక్‌తో ఆగిన 600 యూనిట్

ఎర్రగుంట్ల, మార్చి 18: ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే 6వ యూనిట్ సోమవారం సాయంత్రం 5.30గంటల సమయంలో ట్యూబ్‌లీక్‌తో ఆగింది. దీన్ని మంగళవారం రెక్టిఫై చేసి సాయంత్రానికి లైటప్ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వేసవి కావడంతో ఆర్టీపీపీలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉంది. మొత్తం ఆరు యూనిట్లను ఏకధాటిగా నడుపుతున్నారు. ఆరవ యూనిట్ ఆగిపోవడంతో మిగతా 5యూనిట్లను పూర్తి స్థాయి విద్యుదుత్పత్తితో నడుపుతున్నారు. బొగ్గు కూడా సుమారు 80వేల మెట్రిక్ టన్నులు స్టాకు ఉంది.

విద్యుత్తు షాక్‌కు ఒకరు మృతి

ఖాజీపేట, మార్చి 18: మండల పరిధిలోని సుంకేసుల హరిజనవాడలో విద్యుత్తు షాక్‌తో ఓబులేసు (51) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే... ఆదివారం రాత్రి ఇంటిలో కరెంటు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు సరఫరా కావడంతో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం మైదుకూరుకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులుయాదవ్‌లు ఓబులేసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

తంబళ్లపల్లె, మార్చి 18: తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఎం.రెడ్డప్ప నాయక్(51) ఆదివారం రాత్రి విధి నిర్వహణలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రెడ్డప్పనాయక్ కొన్ని నెలలుగా పీటీయం మండలం చెంద్రాయనిపల్లె సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు.

నువ్వుల రైతుకు ధరల పోటు

- 20 రోజులలో రూ.18వేల నుంచి రూ.9వేలకు దిగొచ్చిన ధర



నువ్వుల పంట కోసి కుప్పలు వేస్తున్న రైతులు

వేంపల్లె, మార్చి 18: ఆరుగాలం రైతులు శ్రమించి ఏ పంట పండించినా గిట్టుబాటు ధరలు లేక లబోదిబోమంటూ వచ్చిన కాడికే అమ్ముకుంటున్నారు. 20రోజుల వ్యవధిలోనే క్వింటాల్ రూ.18వేలు ఉన్న నువ్వుల ధర రూ.9వేలకు వచ్చిందంటే రైతు పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వేంపల్లె మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో వందల ఎకరాల్లో నువ్వుల పంట సాగుచేశారు. గత నవంబరు, డిసెంబరులలో పంట సాగుచేయగా ఇప్పటికే పలువురు రైతులు పంటను కోశారు. ప్రస్తుతం కోస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30వేలకు పైగా ఖర్చు చేసి పంట సాగు చేయగా.. ఎకరా కు మోస్తరుగా పండితే ఐదు క్వింటాళ్ల వరకు పండుతున్నాయి. పంట అయితే చేతికొచ్చింది కానీ రోజురోజుకు ధర తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. 20రోజుల క్రితం క్వింటాల్ రూ.18వేలు ఉంది. ఈ ధర రోజురోజుకు తగ్గిపోయి ప్రస్తుతం రూ.9వేల నుంచి రూ.10వేల మధ్య ఉంది. ఈ ధర పెట్టుబడికే సరిపోతోందని ఆవేదన చెందుతున్నారు. ఇక అరకొరగా పండిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్రోకర్ల మాయాజాలం రైతులకు నిల్వ చేసుకొని గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకునే వీలు లేకపోవడం వల్ల ఈ దుస్థితి దాపురించింది.



పండించిన నువ్వుల మూటెలతో దిగాలుగా రైతు

రూ.9500కు అమ్ముకున్నాం

ఐదెకరాల్లో నూగుపంట సాగుచేశాం. క్వింటా రూ.9500 విక్రయించాం. 20రోజుల క్రితం ధర బాగుండేది. ఎందుకనో ధర తగ్గిపోయింది. గిట్టుబాటు ధర ఉంటే అంతో ఇంతో లాభపడేవాళ్లం. పంట పండిన ప్రయోజనం లేకుండా పోయింది.

-శ్రీలక్ష్మి, మహిళా రైతు, వేంపల్లె

గిట్టుబాటు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే ఉపయోగం ఉంటుంది. ధరల స్థిరీకరణ నిధి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నువ్వుల పంట సాగుచేస్తే ధర లేక పెట్టుబడి, ఖర్చులకే సరిపోతోంది. మూడు నెలల పాటు చేసిన శ్రమ అంత వృథా అయింది.

శేఖర్, రైతు, చింతలమడుగుపల్లె, వేంపల్లె.

పోలీసుల కవాతు

పుల్లంపేట, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పుల్లంపేటలో సోమవారం రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, పుల్లంపేట ఎస్ఐ రఘురాం ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతునిర్వహించారు. శ్రీరాములపేట నుండి పుల్లంపేట మెయిన్‌రోడ్డులో జెండామాను వరకు పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని గుంపులు గుంపులుగా ఉండవద్దని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18: లక్కిరెడ్డిపల్లెలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు, 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినిలు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, అలాగే 7, 8, 9 తరగతిలో మిగిలిన సీట్లుకు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

'పంతగానికి టిక్కెట్ కేటాయించాలి'

రైల్వేకోడూరు, మార్చి 18: పంతగాని నరసింహప్రసాద్‌కే టీడీపీ టిక్కెట్ కేటాయించాలని పలువురు టీడీపీ దళిత నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో కూని చంద్రయ్య, శంకరయ్య, హరి, ప్రవీణ్ తదితరులు సోమవారం పూజలు చేశారు. నియోజకవర్గంలో ఎక్కువగా టీడీపీకే విజయావకాశాలు ఉన్నాయని, పంతగానికి ఇస్తే కొరముట్లకు సరైన జోడిగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18: మండలంలోని గ్రామాల్లో తాగునీటితో ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారని, తక్షణమే గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం బి.ఎర్రగుడి, చంచర్లపల్లె, మూడిండ్లపల్లె గ్రామాల్లో తాగునీటి కోసం కి.మీ. దూరం పరుగులు తీస్తున్నారని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే బోర్లు వేసి సమస్య పరిష్కరించాలన్నారు.

జిల్లా కేంద్రంలో కనిపించని పచ్చదనం

- ఎడారిని తలపిస్తున్న జాతీయ రహదారి
- పచ్చదనం, పరిశుభ్రతను పాటించని మున్సిపల్ అధికారులు



ఎడారిని తలపిస్తున్న రాయచోటి పట్టణం నుంచి కలెక్టరేట్‌కి వెళ్లే జాతీయ రహదారి

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 18: జిల్లా కేంద్రం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు అభివృద్ధి, పచ్చదనంలో రాయచోటి పట్టణం వెనుకబడి ఉందనే చెప్పాలి. 2016లో ప్రారంభమైన చిత్తూరు-కడప జాతీయ రహదారిపై ఇప్పటి వరకు ఒక్క మొక్క కూడా అధికారులు నాటలేదు. మున్సిపల్ సమావేశం జరిగినప్పుడల్లా పట్టణంలో మేము అది చేశాం.. ఇది చేశాం అని గొప్పలు చెప్పడం తప్ప ఆచరణ సాధ్యం కాలేదని అర్థమవుతోంది. కడప రింగు రోడ్డు నుంచి చిత్తూరు రింగు రోడ్డు వరకు కనీసం ఒక్క మొక్క కూడా ఇప్పటి వరకు నాటని ఈ మున్సిపల్ అధికారులు పర్యావరణ పరిరక్షణ ఎలా కాపాడుతారన్న ప్రశ్న అందరిలోనూ ఉంది. పట్టణంలో జాతీయ రహదారి లేక ముందు ప్రతి వంద మీటర్లకు ఒక చింతచెట్టు కానీ లేక వేపచెట్టు కానీ ఉండేది. రోడ్డు విస్తరణ కోసం చెట్లని కొట్టి వేయడంతో మొత్తం జాతీయ రహదారి మండుటెండలో ఎడారి ప్రాంతాన్ని తలపించే విధంగా ఉంది. బంగ్లా దగ్గర నుంచి బస్టాండు వరకు డివైడర్‌ను ఏర్పాటు చేసి అక్కడ కొన్ని మొక్కలు నాటారు తప్ప మిగిలిన పట్టణంలో ఎక్కడా కూడా మొక్కలు నాటిన పాపాన పోలేదు. బస్టాండు సర్కిల్, నేతాజి సర్కిల్, ఠానా సర్కిల్, గొల్లపల్లి సర్కిల్, కలెక్టరేట్ వరకు ఎక్కడా కూడా ఒక్క మొక్క నాటిన పాపాన పోలేదు. మున్సిపాలిటీ బిల్డింగ్ గోడలపైన మాత్రం పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాసుకున్నారు తప్ప ఆచరణ మాత్రం ఎక్కడా సాధ్యం కాలేదు. ప్రజారోగ్యంపై శ్రద్ధ తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులే ఇలా ఉంటే ప్రజా ఆరోగ్యం ఎలా బాగుపడుతుందనే విమర్శలు బలంగా వినపడుతున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ వాసు బాబును వివరణ కోరగా.. 'నేను కొత్తగా వచ్చాను. మొక్కలు నాటాలని ప్రతి మున్సిపాలిటీలో టార్గెట్ ఉంటుంది. కానీ ఇక్కడ ఏ మాత్రం మొక్కలు నాటారో నాకైతే తెలియదు. ఇంజనీరింగ్ సెక్షన్ వారిని అడిగి తెలుసుకుంటాను' అన్నారు.

సిట్టింగ్ స్క్వాడ్ అధికారుల నియామకం

నందలూరు, మార్చి 18: సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల వ్యాప్తంగా సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమిస్తూ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సిట్టింగ్ స్క్వాడ్ అధికారిమితులైన ఎస్.రౌఫ్‌బాష తెలిపారు. నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి ఎస్.రౌఫ్‌బాషా, నాగిరెడ్డిపల్లె హైస్కూల్ పరీక్ష కేంద్రానికి శిల్పి ఆనందాచారి, ఆడపూరు పరీక్ష కేంద్రంలో ఆనంద్‌లను సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్.రౌఫ్‌బాష మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

ఉచితంగా వ్యాసెక్టమీ శస్త్ర చికిత్స

నందలూరు, మార్చి 18: రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు ఉచితంగా వ్యాసెక్టమీ శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు సీహెచ్‌వో వెంకటనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాల్లోపు వయసు ఉండి, పిల్లలున్న వారికి మళ్లీ పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డాక్టర్ శేఖర్, డాక్టర్ శరత్‌కమల్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి రూ.1100 పారితోషికం, వారిని తీసుకొచ్చి వచ్చిన వారికి రూ.200 ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామాపురం, మార్చి 18: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (మోడల్) పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ఎండీ అప్రోచ్‌బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31 లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలోనే ఉంటుందన్నారు. విద్యార్థులకు 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు/ ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధిస్తారని, చదువుకోవడానికి ఎలాంటి ఫీజులు కట్టనవసరం లేదని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ, విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాలన్నారు. ఆబ్జెక్టివ్ టైపులో ఉన్న ప్రవేశ పరీక్షలో ఓసీ, బీసీ అభ్యర్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 30 మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ చేసేటప్పుడు కులం, ఆదాయం, ఆధార, విద్యార్థి చదువుతున్న పాఠశాలల్లో స్టడీ సర్టిఫికెట్లతో జత చేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రచార పిచ్చికి ముకుతాడు

- విస్తృతంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు



మండల కేంద్రంలో వైసీపీ జెండాలు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

సుండుపల్లె, మార్చి 18: నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, ఇరుకు సందులు, ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులతో నింపేశారు. కోడ్ అమల్లోకి రావడంతో ఈ ప్రచార పిచ్చికి తెరపడింది. రాజకీయ నాయకుల హోర్డింగులను తొలగిస్తున్నారు. విగ్రహాలకు ముసుగులు పడుతున్నాయి. మండల కేంద్రంలో టీ స్టాల్, కూల్‌డ్రింక్ షాపులు, చిల్లర అంగళ్లు అని కూడా చూడకుండా 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఆదివారం, సోమవారం ఎంపీడీవో అమర్‌నాథ్ ఆధ్వర్యంలో పంచాయతీ సహాయకులు పోస్టల్ బ్యానర్లను తొలగించారు. 14 గ్రామ పంచాయతీల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల దగ్గర ఏర్పాటు చేసిన సీఎం పోస్టర్లను తొలగించారు. టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లు, జెండాలను కూడా తొలగించారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తాం



విలేకర్లతో మాట్లాడతున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, మార్చి 18: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోసం సమష్టిగా కృషి చేస్తామని మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక హరిత హోటల్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తు కారణంగా రాజంపేట టీడీపీ టికెట్ ప్రకటించడం ఆలస్యమవుతుందని, దీనిపై కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ శివకుమార్, మోదుగుల నరసింహులు, చింతగింజల సుబ్రమణ్యం, బాలకృష్ణయ్య, దత్తాత్రేయులు, చేపూరి బాలాంజనేయులు, దిలీప్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

సుండుపల్లె, మార్చి 18: రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఏఆర్ ఎస్ఐ నారాయణ తెలిపారు. అనుమానిత వాహనాలను రాయచోటి ప్రధాన రహదారిలో నిలిపి ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు.. ఎందుకు వచ్చారని అడిగి తెలుసుకున్నారు. వాహనాల్లో నగదు, మద్యం తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు. వాహనాల మీద పార్టీ గుర్తులతో ఉన్న స్టిక్కర్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి పొత్తు... వైసీపీ చిత్తు

- టీడీపీ మహిళా నాయకురాలు వరలక్ష్మితో మహిళల చర్చలు



మహిళలతో సమావేశమైన వరలక్ష్మి

రైల్వేకోడూరు, మార్చి 18: ఉమ్మడి పొత్తుతో వైసీపీ చిత్తు చిత్తుగా ఓడిపోతుందని రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి తెలిపారు. సోమవారం రైల్వేకోడూరుకు చెందిన మహిళలందరితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబును మహిళలందరు సీఎంగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా మహిళలందరూ కలసి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పొత్తు చూసి ఆకర్షితులై వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకులపేట, సూర్యనగర్, పగడాలపల్లె ప్రాంతాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

ఓబులవారిపల్లె, మార్చి 18: గ్రామాల్లోని ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. దోమలు వ్యాప్తి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలుతాయని ఏఎన్ఎం నీరజ, ఆశా కార్యకర్తలు సంబంధించిన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తెలిపారు. అలాగే దోమలు వ్యాప్తికి కారణం అయిన లార్వా నివారణకు పిచికారీ మందులు చల్లారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం, మార్చి 18: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. అనాథలు, బడిబయట ఉన్న చిన్నారులు లేదా పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్ర్య రేఖకు దిగువ జీవిస్తున్న బాలికలు మాత్రమే అర్హులన్నారు.

ఆక్రమణపై తహశీల్దారుకు ఫిర్యాదు

పుల్లంపేట, మార్చి 18: మండల పరిధిలోని కేతరాచపల్లె గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు సోమవారం తహశీల్దారు శ్రీనివాసరాజుకు ఫిర్యాదు చేశారు. పక్క మండలమైన చిన్నంపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎక్స్‌వేటర్లు పెట్టి చదును చేస్తున్నారని తాము కూడా అడ్డుకున్నామన్నారు. రాత్రి వేళ కబ్జాదారులు యంత్రాలతో చదును చేసుకుంటూ వస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకొని కబ్జాదారులపై చట్టపరమైన తీసుకోవాలని ఈ సందర్భంగా తహశీల్దారును కోరారు. గ్రామంలో నిరుపేదలు ఉన్నారని, అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు పట్టాలు పంపిణీచేందుకు అంతా సిద్ధమైన సమయంలో మండలంలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశం ఆగిపోయిందని, దీంతో కబ్జాదారులు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. దీనిపై తహశీల్దారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివారం భూ ఆక్రమణపై తనకు ఫోన్ ద్వారా సమాచారం తెలిసిందని, వెంటనే వీఆర్వోను పంపామని ఆయన అన్నారు.

'అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం'

చిన్నమండెం, మార్చి 18: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరితారెడ్డి, మండిపల్లి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సహజ వనరులను ఆదాయ వనరుగా మార్చుకొని ప్రతి వ్యవస్థలోనూ ప్రభుత్వం కమీషన్లతో ప్రజలను దోచుకుంటోందని ఆమె విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాలను సైతం తనఖాకు పెట్టి అప్పులు తెచ్చుకున్న ఈ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే మన పిల్లల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలో పడుతుందని ఆమె ఓటర్లను విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం విధ్వంసంపై ప్రజలకు వివరించి టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, మార్చి 18: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామివారి పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడ వీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పల్లకీ ఉత్సవంపై వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలు

జాతీయ సేవా పథకం కార్యక్రమం

ఓబులవారిపల్లె, మార్చి 18: మండలంలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో డాక్టర్ వై.ఎస్.ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ అనంతరాజుపేట ఆధ్వర్యంలో జాతీయ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు ఆధ్వర్యంలో వారం రోజులు పాటు విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పారిశుధ్య నిర్వహణ, రక్తదాన శిబిరం, వైద్య సేవలు, విలువలు ఆధారిత ఉత్పత్తుల తయారీ, కలుపు మొక్కల నివారణ వంటివి గ్రామ ప్రజలకు తెలిపి గ్రామ అభివృద్ధికి సహాయపడేలా చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని ప్రొఫెసర్ డాక్టర్ యువరాజ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ యశ్వంత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు, వైద్యులు దీప్తికిరణ్, నిశ్చాల, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిష్టానం ఎవరికి టికెట్టు ఇచ్చినా గెలుపునకు కృషి చేస్తాం : టీడీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాజంపేట, మార్చి 18: అధిష్టానం ఎవరికి టికెట్టు ఇచ్చినా అధిష్టానం నిర్ణయమే శిరోధార్యంగా భావించి వారి గెలుపునకు కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గీయులు స్పష్టం చేశారు. సోమవారం విజయశేఖర్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ బీసీ నాయకులు రాముయాదవ్, పట్టణ నాయకులు చందా సుబ్రమణ్యం, తెలుగు యువత ఉపాధ్యక్షుడు చీనేపల్లి హరీష్, ఎస్సీ సెల్ నాయకులు పందికాళ్ల జయరాం, నందలూరు టీడీపీ నాయకులు ధనుంజయనాయుడు, మన్నెం నాగరాజు, యల్లంరాజుపల్లె టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీకి అభ్యర్థే లేడని ఏదేదో ప్రచారాలు చేస్తున్నా ఎవరికి టికెట్టు ఇచ్చినా గెలిచేది టీడీపీనే అని తెలిపారు. టీడీపీ హయాంలో రాజంపేట నియోజకవర్గానికి జిల్లా కేంద్రంలోనూ, వైద్య కళాశాల ఏర్పాటులోనూ, అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంలోనూ, బాధితులను ఆదుకోవడంలోనూ, భూ కబ్జాలు చేయడంలోనూ, అభివృద్ధి చేయడంలోనూ అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. అన్ని వర్గాల్లో ఆదరాభిమానాలు ఉన్న నేతకు త్వరలో టికెట్టు ఇస్తారని, ఆ అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామని తెలిపారు.

ప్రజాగళం విజయంతో వైసీపీ నేతల్లో వణుకు

- రాజంపేట టీడీపీ నేతలు వెల్లడి



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాజంపేట, మార్చి 18: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ రాష్ట్ర చరిత్రలోనే ఘన విజయం సాధించడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని, గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, రాజంపేట పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యం నాయుడులు వెల్లడించారు. రాజంపేట టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఈ సభకు కనీవిని ఎరుగని రీతిలో లక్షలాది మంది హాజరయ్యారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ నేతలను తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు పోలి శివకుమార్, నియోజకవర్గ నాయకులు పరుశురాంనాయుడు, సూర్యనారాయణనాయుడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా కలిసికట్టుగా పనిచేస్తాం



విశ్వనాథనాయుడుతో మండల నాయకులు

పెనగలూరు, మార్చి 18: మరో రెండు నెలల్లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా అతని విజయానికి కలిసికట్టుగా పనిచేస్తామని నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చినట్లు మండల నాయకులు తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో రాజకీయ భవిష్యత్తుపై సమాలోచనలు జరిపినట్లు మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన అంతమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు ఎన్.రాంప్రసాద్‌నాయుడు, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.షామీర్, ఎన్.ఆర్.ఐ కొల్లా నరసింహులు, అనంతంపల్లె మాజీ సర్పంచ్ ఎం.శంకరయ్యనాయుడు, కస్తూరి శివ, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కె.నాగేశ్వరనాయుడు తదితరులు విశ్వనాథనాయుడును కలిసి సమాలోచనలు జరిపారు.

పలువురిపై రౌడీషీట్ నమోదు



మన్నూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరైన టీడీపీ నేతలు

రాజంపేటటౌన్, మార్చి 18: రాజంపేట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు పోలిశివతో పాటు 16 మందిపై మన్నూరు పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు. ఎన్నికల సమయంలో వారిపై రౌడీషీట్ నమోదు చేయడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వీరిపై తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేసినట్లు వారు ఆరోపించారు. వీరిని ఆదివారం మన్నూరు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా గన్నె సుబ్బనరసయ్యనాయుడు, పోలి శివకుమార్‌లు మాట్లాడుతూ గతంలో వైసీపీ నేతలు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదులతో తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని, ఆ కేసులను తొలగించకుండానే వాటిని ఆధారంగా చేసుకొని ఎన్నికల సమయంలో రౌడీషీట్ నమోదు చేయడం తగదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని రౌడీషీటర్లు నమోదు చేసినా వచ్చేది టీడీపీనే అన్నారు. ఈ విషయమై మన్నూరు సీఐ రవికుమార్‌ను వివరణ కోరగా, గతంలో ఉన్న కేసుల ఆధారంగా చట్టానికి అనుగుణంగా వీరిపై ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ రౌడీషీటర్ నమోదు చేశామని, ఇందులో ఎటువంటి ఆరోపణలకు తావు లేదన్నారు.



టీడీపీ నేతపై అకారణ దాడి

మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరిపై బీసీ సెల్ అధ్యక్షుడి ఫిర్యాదు - పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు

పుత్తూరు అర్బన్, మార్చి 18: టీడీపీ చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి. సునీల్ సోమవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారు.ఈ విషయమై షణ్ముగరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రకారం.... పట్టణంలోని చింతలగుంటలో తుడా నిధులతో పార్కు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కాంపౌండ్ గోడ నిర్మించేందుకు పిల్లర్ల కోసం గుంతలు తీశారు. సోమవారం సాయంత్రం అటు వెళుతున్న షణ్ముగరెడ్డికి కుక్క పిల్ల అరుపు వినిపించడంతో అటు వెళ్లి చూశాడు.పిల్లర్ల కోసం తీసిన గుంతలో కుక్కపిల్ల పడిపోయి ఉండడంతో పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. ఇంతలో అటు వచ్చిన మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, అతని అనుచరుడు పి.సునీల్ పనులకు సంబంధించిన ఫొటోలు తీస్తున్నాడని షణ్ముగరెడ్డిపై దాడి చేశారు. తాను కుక్కపిల్లను బయటకు తీస్తున్నానని చెబుతున్నా వినకుండా రాళ్లతో తనపై దాడి చేశారని , గతంలో కూడా హరి, అతని అనుచరులు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదులో షణ్ముగరెడ్డి పేర్కొన్నాడు.ఈ దాడి విషయం తెలియడంతో టీడీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హరిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టాయి.అదే సమయంలో హరి తన అనుచరులతో స్టేషన్‌కు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరుపులు, కేకలతో స్టేషన్ పరిసరాలు దద్దరిల్లాయి. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించాల్సి వచ్చింది. దీంతో పుత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.





పోలీస్ స్టేషన్ బయట గుమికూడిన టీడీపీ శ్రేణులు - (ఇన్‌సెట్లో) పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న షణ్ముగరెడ్డి తదితరులు

టీడీపీలో చేరాడని..!

- చిత్తూరులో వైసీపీ నేతల దాడి
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు

చిత్తూరు, మార్చి 18: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీలో చేరడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలో ఆటోలను సీరియల్‌లో పెట్టే విషయంలో తలెత్తిన వివాదంలో రాళ్ల దాడికి దిగారు. ఈ ఘర్షణలో టీడీపీ కార్యకర్త నవీన్ గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు మురకంబట్టులో ఆదివారం కొన్ని కుటుంబాలు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ విషయాన్ని మురకంబట్టులో అధికారాన్ని చెలాయిస్తున్న వైసీపీ నాయకుడు చిన్ని జీర్ణించుకోలేకపోయారు. తమను కాదని టీడీపీలో ఎలా చేరతారని నవీన్, అతడి బంధువులను బెదిరించారు. ఈ నేపథ్యంలో సోమవారం కూడా మురకంబట్టు ఆటోస్టాండ్ వద్ద నవీన్ అన్న దామోదరం, చిన్ని అనుచరుడు మురగేశ్ మధ్య ఆటోలను సీరియల్‌లో పెట్టుకునే క్రమంలో ఘర్షణ తలెత్తింది. దాంతో దామోదరం తన తమ్ముడైన నవీన్‌కు ఫోన్ చేసి పిలిపించారు. నవీన్ ఆటో స్టాండ్ వద్దకు రాగానే.. చిన్ని వర్గీయులు నవీన్‌పై, అతని బంధువులపై ఇటుక రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో నవీన్, మురుగేశ్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలపాలైన టీడీపీ కార్యకర్త నవీన్‌ను టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ నేతలు కాజూరు బాలాజి, ఇతర నేతలు పరామర్శించారు. కాగా, ఈ ఘటనపై ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు.



గాయాలపాలైన నవీన్‌ను పరామర్శిస్తున్న గురజాల జగన్‌మోహన్

వ్యక్తిగత దాడులకు పాల్పడితే సహించం: గురజాల

ఎన్నికలను ఎన్నికలుగానే చూడాలని, వ్యక్తిగత దాడులకు పాల్పడితే సహించేది లేదని గురజాల జగన్మోహన్ హెచ్చరించారు. నవీన్‌ను ఆస్పత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ స్థానిక నాయకుడు చిన్ని, అతని వర్గీయులు దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఈ రోజు అధికారంలోకి ఒకరుంటారని, రేపు మరొకరు ఉంటారన్న విషయాన్ని వైసీపీ నేతలు గుర్తించుకోవాలన్నారు.

టెన్త్ పరీక్షల్లో నిబంధనలు గాలికి..!

- పరీక్షా కేంద్రాల వద్ద తెరచి ఉంచిన జెరాక్స్ కేంద్రాలు
- అమలుకాని 144 సెక్షన్



కృష్ణవేణి కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు - గిరింపేట శివాలయంలో విద్యార్థుల పూజలు - విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), మార్చి 18: జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. చిత్తూరులో తొలిరోజున కొన్ని నిబంధనలను గాలికి వదిలేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఎందుకంటే.. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ కేంద్రాలను మూసివేయించడంలో విద్యాశాఖ అధికారులు విఫలయ్యారు. ఉదయం నుంచీ ఈ కేంద్రాలు యథావిధిగా పనిచేశాయి. 144 సెక్షన్ అమల్లోనూ ఉదాసీనంగా వ్యవహరించారు. గతేడాది పరీక్షా కేంద్రాలకు కనీసం 200 మీటర్ల దూరంలో ఏ ఒక్కరూ ఉండకుండా చర్యలు చేపట్టారు. ఇప్పుడేమో పరీక్ష జరిగేంత వరకు కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు గుంపులుగా ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లడంపైనా పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయ. ఇక, పెద్ద సంఖ్యలో ఇన్విజిలేటర్లు పరీక్షల విధులకు హాజరు కాలేదు. దీంతో రిజర్వులోని ఇన్విజిలేటర్లకు హుటాహుటిన విధులు కేటాయించారు. తొలి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 21757 మంది విద్యార్థులకుగాను 21156 మంది హాజరుకాగా, 601 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. తొలి రోజు కావడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమీపంలోని దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలువురు విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లారు. తమ పిల్లలు పరీక్ష రాస్తున్నంత సేపు.. వారి తల్లిదండ్రులు ఆయా కేంద్రాల బయట టెన్షన్‌తో గడిపారు.



మున్సిపల్ స్కూల్ వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూస్తున్న విద్యార్థులు

ఆత్మహత్య చేసుకుంటానంటే పెళ్లి చేసుకున్నా

- అత్తింటికెళితే అర్ధరాత్రి గెంటేశారు
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బంగారుపాళ్యం, మార్చి 18: 'ప్రేమించానంటూ వెంటబడ్డాడు. పెళ్లి చేసుకోకుంటే నిన్ను చంపేసి, నేనూ ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. చివరకు పెళ్లి చేసుకుని భర్త తో కలిసి అత్తింటికి వెళితే వారేమో అర్ధరాత్రి అని కూడా చూడకుండా ఇంటి నుంచి గెంటేశారు' అని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం పాలేరు పంచాయతీ శేషాపురానికి చెందిన బాబు కుమార్తె యమున ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువు ముగించింది. అదే కళాశాలలో అదే పంచాయతీ మోతకుంటకు చెందిన శేఖర్ కుమారుడు అభిరామ్ (లోకరాజ్) చదువుకున్నాడు. ఆ సమయంలో ప్రేమించానంటూ యమున వెంటపడేవాడు. ఆ తర్వాత 'పెళ్లి చేసుకోకుంటే నిన్ను చంపి, నేను కూడా ఆత్మహత్య చేసుకుంటా' అని బెదిరించేవాడు. ఈనేపథ్యంలో యమునను ఈనెల ఆరో తేదీ రాత్రి ఓ కారులో తమిళనాడు రాష్ట్రం అరుణాచలం తీసుకెళ్లి అక్కడ ఓ దేవాలయంలో తాళికట్టాడు. అదేరోజు రాత్రి మోతకుంటలోని తన స్వగృహానికి భార్యను తీసుకెళ్లాడు. అయితే అతడి తల్లిదండ్రులు ఈ పెళ్లిని అంగీకరించలేదు. మెడలోని తాళిని తెంచేసి, యమున వద్ద ఉన్న బంగారం, ఫోన్‌ను లాక్కొని, ఇంటినుంచి గెంటేశారు. అభిరామ్ తండ్రి శేఖర్, అతని కుమారులు కృష్ణ, అనిల్ వారి ద్విచక్రవాహనంలో అదే రోజు అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో శేషాపురం వద్ద రోడ్డుపై వదిలేశారు. దాంతో పుట్టింటికి వెళ్లడానికి భయపడిన ఆమె మదనపల్లెలోని తన స్నేహితురాలి వద్దకు వెళ్లిపోయింది. భర్తకు ఫోన్ చేయగా, ఎంతకూ సమాధానం రాకపోవడంతో సోమవారం బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. అభిరామ్, అతని తల్లిదండ్రులు నాగభూషణమ్మ, శేఖర్, సోదరులు కృష్ణ, అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



యమున, అభిరామ్

నాకు చిత్తూరు కంటే పుంగనూరే ముఖ్యం!

- చల్లా రామచంద్రారెడ్డితో సీకే బాబు

పుంగనూరు, మార్చి 18: తనకు చిత్తూరు ఎన్నికల కంటే పుంగనూరులో టీడీపీ గెలుపే ముఖ్యమని, ఎప్పుడు పిలిచినా ఎన్నికల ప్రచారానికి వస్తానని మాజీ ఎమ్మెల్యే సీకే బాబు చెప్పినట్లు తెలిసింది. చిత్తూరులో సోమవారం సీకేబాబును పుంగనూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) కలిసి ఎన్నికలపై చర్చించారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓటమే తన ధ్యేయమని, అందుకోసం ఎప్పుడు పిలిచినా వచ్చి ప్రచారం చేయడానికి సిద్ధమని ఆయన చెప్పినట్లు సమాచారం. పెద్దిరెడ్డిని ఓడించడానికి తన సపోర్టు ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే పుంగనూరు పర్యటనకు ఆహ్వానిస్తానని చల్లా బాబు చెప్పారు.



సీకే బాబుతో మాట్లాడుతున్న చల్లా బాబు

కాగా, 1985 నుంచీ పెద్దిరెడ్డి, సీకే మధ్య వైరం కొనసాగుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరులో గోపినాథ్‌కు, సీకే బాబుకు మధ్య గతంలో రాజకీయ విభేదాలుండేవి. గోపీనాథ్‌కు అప్పట్లో పీలేరు ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మద్దతు ఉండేది. సీకే, పెద్దిరెడ్డి మధ్య వైరానికి ఇదీ ఓ కారణమని తెలుస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీలో వర్గరాజకీయాల నేపథ్యంలో సీకే బాబుతో మాజీ సీఎంలు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సన్నిహితంగా ఉండేవారు. గతంలో చిత్తూరులో జిల్లా కాంగ్రెస్ సమావేశానికి వచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి అనుచరులను సీకే బాబు అనుచరులు గొడవచేసి అడ్డుకున్నారు. అప్పట్నుంచి వీరి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. అందుకనే సీకే బాబు వైసీపీలో చేరడాన్ని పెద్దిరెడ్డి అడ్డుకున్నట్లు ప్రచారం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని సీకే బాబును చల్లా బాబు కలిసి ప్రచారానికి ఆహ్వానించారని తెలుస్తోంది.

టీడీపీలోకి వెంకటరమణరాజు!

గతంలో పుంగనూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండుసార్లు పోటీ చేసిన వెంకటరమణరాజు మళ్లీ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. గత ఎన్నికలకు ముందు పుంగనూరు ఇన్‌చార్జిగా ఆయన స్థానంలో ఎన్.అనీషారెడ్డిని నియమించారు. దీంతో ఆయన వైసీపీలో చేరారు. కాగా, చల్లా రామచంద్రారెడ్డి చొరవతో ఆయన మళ్లీ టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్ ఇవ్వగానే ఆయనతో పాటు పలువురు వైసీపీ నేతలు పసుపు కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

ప్రభుత్వాస్పత్రికి వైసీపీ రంగుల మాటేమిటి?



ఆస్పత్రి గోడలకున్న వైసీపీ రంగులు

కార్వేటినగరం, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కార్వేటినగరం ప్రభుత్వ ఆస్పత్రి గోడలకు వైసీపీ రంగులు మాత్రం సోమవారం కూడా అలాగే ఉన్నాయి. ఎన్నికల నిబంధనలు అధికార పార్టీ రంగులకు వర్తించదా అని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

'కోడ్' అమలుకు సహకరించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18: ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, బహిరంగ స్థలాల్లో అనుమతి లేకుండా రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగులు, పోస్టర్లు, కటౌట్లు తక్షణం తొలగించాలన్నారు. లేదంటే మున్సిపల్, పంచాయతీ యంత్రాంగం తొలగిస్తుందని చెప్పారు. నిబంధనలకు లోబడి పార్టీ నేతలు ప్రచారాల్లో పాల్గొనాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. టీడీపీ ప్రతినిధులు సురేంద్రకుమార్, కోదండ యాదవ్ మాట్లాడుతూ.. నిష్పక్షపాతంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. సమావేశంలో పి.భాస్కర్ (బీఎస్పీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), పరదేశి (కాంగ్రెస్), ఉదయ్‌కుమార్ (వైసీపీ) తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ఎన్నికల విధులపై అవగాహన కల్గి ఉండాలి

తమకు కేటాయించిన ఎన్నికల విధులపై అధికారులంతా అవగాహన కల్గి ఉండాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో కలసి వివిధ బృందాల నోడల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బందితో సమీక్షించారు. ఎన్నికలు సాఫీగా నిర్వహించడానికి 24 బృందాలతో కూడిన నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలన్నీ జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌తో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆర్వోల ద్వారా నిర్దేశిత సమయంలోగా నివేదికలను ఎన్నికల అధికారికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పంపించాలని చెప్పారు.

ఎస్వీ జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి

మంగళం, మార్చి 18: శ్రీవెంకటేశ్వర జూపార్కులో 7 సంవత్సరాల 6 నెలల వయసు ఉన్న మగ బెంగాల్ టైగర్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. 2016వ సంవత్సరంలో ఇక్కడే జన్మించిన ఈ పులి పుట్టుకతోనే కంటి జబ్బుతో బాధపడుతోంది. రెండు కళ్లు కనిపించకపోవంతో నిపుణులైన వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. కాగా ఈనెల 16న చికిత్స అందించడానికి ప్రయత్నించడంతో అది సహకరించలేదు. 17వ తేదీ రాత్రి 8.30 గంటలకు మృత్యువాతపడిందని, ఎస్వీ యూనివర్సిటీలో వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాని మెదడులో హైపోప్లాసిమా, హైడ్రో నస్రాప్రస్ లెడ్ టు నెప్రిటిస్ అనే వ్యాధితో చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు.



చనిపోయిన పులి (ఫైల్‌ఫొటో)

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

సదుం, మార్చి 18: సదుంలో సోమవారం సాయంత్రం సాంకేతిక లోపంతో ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధమైంది. తన ఎలక్ట్రిక్ స్కూటరులో సదుం నుంచి తన మరదలు శ్రీనిత్య చెరుకువారిపల్లెకు వస్తున్నారని జ్యోతీశ్వర్‌రెడ్డి తెలిపారు. మార్గమధ్యంలో ఫోన్ కాల్ రావడంతో ఆపి పక్కకు వచ్చి మాట్లాడుతుండగా స్కూటర్‌లో మంటలు చెలరేగి దగ్ధమైందన్నారు. దీనిని తాను 2022లో కొన్నట్లు చెప్పారు. గతంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తగా షోరూం నిర్వాహకులు పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆటోను ఢీకొన్న మినీ లారీ

ఒకరి దుర్మరణం, మరొకరికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, మార్చి 18: ఆటోను మినీ లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం మంగుంట గ్రామానికి చెందిన కె.మునికృష్ణ (35), సుభాష్(44) 49.కొత్తపల్లె మిట్ట నుంచి ఇంటికి ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యంలో సోమవారం రాత్రి సుమారు 9.30 గంటలకు చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై ఆరిమాకులపల్లె హైస్కూల్ వద్దకొచ్చేసరికి చిత్తూరు వైపు కోళ్ల లోడుతో వెళుతున్న మినీ లారీ ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జవగా అందులోని మునికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, సుభాష్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మినీ లారీ డ్రైవర్ పరారైనట్లు సమాచారం. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఆర్‌పురం ఎస్ఐ కుళాయప్ప తెలిపారు.



నుజ్జునుజ్జయిన ఆటో - ప్రమాదానికి కారణమైన మినీలారీ - ఇన్‌సెట్‌లో మునికృష్ణ (ఫైల్ ఫొటో)

టీడీపీ,బీజేపీ,జనసేన కూటమికి బ్రహ్మరథం

● టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 18: ప్రజాగళం పేరుతో చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద బీజేపీ, టీడీపీ, జనసేన సంయుక్తంగా నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని మదనపల్లె టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక సుభాష్ రోడ్డులో షాజహాన్‌బాషా నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నాలుగేళ్ల 10 నెలల అరాచక పాలనలో లక్షలాదిమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, టీడీపీ నాయకులు బాధితులయ్యారన్నారు. రాష్ట్ర మంత్రులు అక్రమ సంపాదనతో కోట్లకు పడగలెత్తారని, వైసీపీ ఎమ్మెల్యేలు కొంత మంది వందల ఎకరాల భూమిని కబ్జా చేశారన్నారు. వైసీపీ పాలనలో రూ.12లక్షల కోట్లు అప్పులు చేసి 5 కోట్ల ఆంధ్రుల నెత్తిన మోపారన్నారు. మూడు పార్టీల కూటమి చూసి వైసీపీ నాయకుల్లో వణుకు పుట్టిందన్నారు. దోచుకున్న డబ్బుతో ప్రజలను లోబరుచుకోవాలని చూస్తున్నారని, వారి పప్పులేవీ ఉడకవన్నారు. కూటమి పార్టీలు 160 సీట్లు సాధించడం ఖాయమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలంటే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మదనపల్లె సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నిర్మాణం పూర్తి చేయడానికి రూ.4కోట్లు మంజూరు చేయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హంద్రీనీవా నీటిని పుంగనూరుకు మళ్లించి మదనపల్లె ప్రజలపై వివక్ష చూపారన్నారు. జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ 151 సీట్లు గెలిచి 30 ఏళ్ల పాటు సీఎంగా ఉంటానని చెప్పిన జగన్ ప్రజాపాలన వదలి 30 ఏళ్లకు సరిపడా ధనం సంపాదించాడన్నారు. పోలవరం, సీపీఎస్ రద్దు తదితర హామీలను నెరవేర్చని జగన్‌ను ప్రజలు గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, ఎస్‌ఏ మస్తాన్, నాదెళ్ల శివన్న, సుద్దిళ్ల సుధాకర్, ఎం. నాగయ్య, జయరామ్, రాజన్న, వేములయ్య, ఎంపీటీసీ దేవేంద్ర, కొయ్యలమండి రాజారెడ్డి, కమలామర్రి కృష్ణ పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేద్దాం

షాజహాన్‌బాషాను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు అన్నారు. సోమవారం తన నివాసానికి వచ్చిన షాజహాన్‌బాషాను సాదరంగా ఆహ్వానించారు. యోగేష్‌బాబు, దొరస్వామినాయుడు, ఎస్‌ఏ మస్తాన్, తెలుగు యువత నాయకులు నాదెళ్ల అరుణ్‌తేజ, ప్రణయ్, బాబ్జాన్ మోడెం శివ తదితరులు పాల్గొన్నారు.- మండలంలోని పొన్నేటిపాళెం వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు బెల్లె హారతి, కురబ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె ప్రసాద్ ఇంటికి షాజహాన్ బాషా వెళ్లి తనకు మద్దతు తెలపాలని కోరారు. ప్రముఖ రియల్టర్ టీకేఎన్ ఇంటికి వెళ్లి మద్దతు కోరారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్: స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులను ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిసి సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కురవంకలోని భువనేశ్వరిదేవి ఆలయాన్ని సందర్శించి, ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేష్‌ను కలిసి ఆశీర్వాదం పొందారు బీజేపీ రాజంపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, జేకే వర్మ, వేణుగోపాల్, రవీంద్ర టీడీపీ నాయకులు నాదేళ్లవిద్యాసాగర్, శివన్న, బాలుస్వామి, నవీన్, కమలమరికృష్ణ, ఇసుకునూతనపల్లె జయరామ్, బిల్లేరెడ్డిప్రసాద్, బ్యాంకు రమణ, తదితరులు పాల్గొన్నారు.

కన్న కూతురే.. కాలనాగైంది

● వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి ఘాతుకం

● టీడీపీ సీనియర్ కార్యకర్త హత్య కేసులో నిందితుల అరెస్టు





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, నిందితుడు అరుణ్ కుమార్

ములకలచెరువు, మార్చి 18: అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురే కాలనాగైంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కన్న తండ్రినే చంపించింది . టీడీపీ సీనియర్ కార్యకర్త హత్య కేసులో కూతురుతో పాటు అమె ప్రియుడ్ని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, ఎస్‌ఐ తిప్పేస్వామి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ములకలచెరువు మండలం సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్దమరువపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త దయ్యాల రాజారెడ్డి(55) ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని కోళ్లఫారంలో హత్యకు గురయ్యాడు. సంచలనం రేపిన ఈ కేసులో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేశారు. పోలీసుల కథనం మేరకు రాజారెడ్డి పెద్ద కుమార్తె బ్రాహ్మణికి వరుసకు బావ వడిగల బాలాజీతో 12 ఏళ్ళ క్రితం వివాహ మైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరూ ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. కాగా, తంబళ్ళపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ అనుగల వారిపల్లెకు చెందిన అరుణ్‌కుమార్‌తో బ్రాహ్మణికి 2019 నుంచి వివాహేతర సంబంధం ఉంది. ఫ్యామిలీ ఫ్రెండ్స్ కావడంతో చిన్నప్పటి నుంచి వీరిద్దరి మధ్య పరిచయం ఉంది. తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేటు వద్ద నున్న కోళ్ళఫారం వద్ద తరచూ ఇద్దరూ కలిసేవారు. ఇంట్లోని బంగారు నగలు కుదువ పెట్టి బ్రాహ్మణి ప్రియుడికి భారీగా నగదు ఇచ్చింది. తాజాగా మదనపల్లెలోని స్థలాన్ని అమ్మి రూ.40లక్షలు ఇవ్వా లని ప్రయత్నించింది. బంగారు కుదువ పెట్టి నగదు ఇవ్వడం, స్థలం అమ్మాలని యత్నించిన విషయం, ఇద్దరి మధ్య ఉన్న సంబంధం గురించి తండ్రి రాజా రెడ్డికి తెలిసింది. దీంతో ఆయన బ్రాహ్మణిని నిలదీయడంతోపాటు తీవ్రంగా మందలించాడు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన బ్రహ్మణి తన తండ్రి రాజారెడ్డిని చంపించాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. ఈ నెల 12వ తేదీన హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం తండ్రిని చంపడానికి కోళ్ళ ఫారంలో గడ్డపార కూడా సిద్ధం చేసి ప్రియుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. గుండెలో నొప్పిగా ఉందని కాఫీ తాగాలని తన భర్త బాలాజీని రాత్రి ఒంటి గంట సమయంలో కోళ్ళ ఫారం దగ్గర నుంచి ఇంటికి పిలుచుకెళ్ళింది. పథకం ప్రకారం కోళ్ళఫారంతో ఒంటరిగా నిద్రిస్తున్న తండ్రిని రెండు గంటల సమయంలో హత్య చేయించింది. హత్య అనంతరం అరుణ్‌కుమార్ ఫోన్‌లో విషయాన్ని బ్రాహ్మణికి చెప్పి ప రారయ్యాడు. కోళ్ళఫారం వద్దకు వచ్చిన బ్రాహ్మణి తన తండ్రిని ఎవరో చంపేశారని నాటకం ఆడింది. ఈ కేసులో రాజారెడ్డి పెద్ద కుమార్తె దయ్యాల బ్రాహ్మణి(24), ఆమె ప్రియుడు అరుణ్‌కుమార్(29)లను పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన గడ్డపారను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత కసాయిగా వ్యవహరించిన కూతురును కఠినంగా శిక్షపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కల్పవృక్ష, సింహ వాహనాలపై ఉగ్రనరసింహుడు



కల్పవృక్ష ,సింహవాహనాలపై నరసింహస్వామి

గుర్రంకొండ, మార్చి 18: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి సోమవారం కల్పవృక్ష, సింహ వాహనాలపై ఆశీనులై కనువిందు చేశారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి, ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, పూజలు చేశరు. సాయంకాలం ఊంజల్ సేవ అనంతరం స్వామి వారిని సింహ వాహనంపై ఆధిరోహింపజేసి ఊరేగిం చారు. స్వామి వారి వాహనం ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్ భట్టార్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, నరసింహ, ఆలయాధికారి కృష్ణమూర్తి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామి వారు ఉదయం తిరుచ్చి ఉత్సవంపై రాత్రి పెద్ద శేష వాహనంపై గ్రామ పురవీధులో ఊరేగనున్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

కలికిరి, మార్చి 18: పాలపై లీటరుకు రూ.4లు అదనపు ధర చెల్లిస్తామని ఐదేళ్ళ క్రితం వైసీపీ ఇచ్చిన హామీ నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజమ్మ విమర్శించారు. కలికిరి పంచా యతీలోని పలు గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా రైతులతో పలు అంశాలపై చర్చించారు ఆవులను పోషిస్తూ, పాలు అమ్ముకోవడంతోనే కుటుంబాలను పోషిస్తున్నట్లు మహిళలు చెప్పడంతో టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు తనూజా రెడ్డి చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు వంతున ప్రభుత్వం అందజేస్తుందని ఆమె వివరించారు. టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను పంచిపెట్టారు. పంచాయతీలోని కొత్తపల్లె, తుమ్మలపేట, వడ్డెపల్లె, జడావాండ్లపల్లె, చింతమాకులపల్లెల్లో తనూజా రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కలికిరి మేజరు పంచాయతీ సర్పంచు ప్రతాప్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ గాయత్రి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, టీడీపీ యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, సాధికార కమిటీలు, అనుబంధ విభాగాల నాయకులు, వివిధ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తుమ్మలపేటలో మహిళా పాడి రైతులతో తనూజా రెడ్డి

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● వాహనం స్వాధీనం ● ఇద్దరి అరెస్టు



స్మగ్లర్లు, వాహనం, ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

పీలేరు, మార్చి 18: ఎర్ర చందనం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని వాహనంతో సహా 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. సుండుపల్లె అటవీ ప్రాంతం నుంచి పీలేరు మీదుగా చెన్నైకి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు తాము ఆదివారం రాత్రి చిత్తూరు జిల్లా కల్లూరు గ్రామ జంక్షన్ వద్ద కాపుకాచామన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 3.45 గంటల సమయంలో వేగంగా వస్తున్న కారు తాము ఆపినా ఆగకుండా వెళ్లడంతో , వెంబడించగా కల్లూరు ఘాటులోని కొమ్మిరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద కారును వదలేసి అందులోని వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా ఇద్దరిని పట్టుకున్నామన్నారు. పట్టుబడినవారు తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన జయవేళ్, కీలక్కాడుకు చెందిన మురుగన్‌గా తేలిందన్నారు. కారులో 364 కేజీలు బరువున్న 11 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో స్మగ్లర్లు, కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన మిగిలిన వారి కోసం కూడా గాలింపు జరుతున్నామన్నారు. ఈ దాడిలో తనతోపాటు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది చరణ్, తదితరులు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ, తదితరులు

పీలేరు, మార్చి 18: ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్డి, ఫర్నీచర్ వంటి కనీస సౌకర్యాలు విధిగా కల్పించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పీలేరు నియోజకవర్గ స్ట్రాంగ్ రూము కోసం ఎంపిక చేసిన సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు ఏఎంసీ ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌లతో కలిసి కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక అధికారులతో మాట్లాడుతూ ఓటర్ల సౌకర్యం కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులతోపాటు ర్యాంపును నిర్మించాలన్నారు. ప్రతి అధికారీ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలను కల్పించాలన్నారు. సౌకర్యాల కల్పనలోగానీ, ఎన్నికల విధుల్లోగానీ నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎంసీ ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలలో స్వల్ప మార్పులు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అక్కడ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఏరియాల గురించి అక్కడున్న బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఆర్‌వో రమా, తహసీల్దారు మహబూబ్ బాషా, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్‌ఐ నరసింహుడు, కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి, ఏవో కరుణాకర్ రెడ్డి, డీటీలు సుబ్రహ్మణ్యం, కిరణ్, ఆర్‌ఐ చాణక్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, మార్చి 18: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతా రాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజ తెలిపారు. కళ్యాణంలో పాల్గొనే భక్తులు ముందస్తు రుసుం చెల్లించి పాల్గొనవచ్చునని, వేడుకల అనంతరం భక్తులకు టీటీడీ వస్త్రాం, ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు.

శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం మార్చి 18 : మండల కేంద్రంలోని ప్రసన్న పార్వతీసమేత విరూపా క్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య, ఆయన కుమారుడు లక్ష్మీ నరసింహ శర్మ, కోడలు శ్రీసాయి కృష్ణ శ్వేత ఆధ్వర్యంలో ఆరుద్ర నక్షత్రంలో పూజలు నిర్వహించి స్వామి వారిని సుందరంగా అలంకరించారు. వేదపండితులు శేషాచలం వర్మ, వేణుగోపాల శర్మ కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆహారం, ఆరోగ్యంతోనే స్త్రీ, శిశు సంక్షేమం

పెద్దతిప్పసముద్రం మార్చి 18: స్త్రీ శిశు సంక్షేమానికి ఆహారంతోపాటు ఆరోగ్యం కూడా అవసరమని సీడీపీవో భాగ్యమ్మ అన్నారు. పీటీఎం మండలం బూర్లపల్లె సెక్టార్, తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్ నాగరత్నమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్. మునిరత్నమ్మ, ఎం. అనసూయ, పి. శ్రీమతి, ఎస్. శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవనంలో శాంతి పూజలు

పీలేరు, మార్చి 18: స్థానిక 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనంలో సోమవారం స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది శాంతి పూజలు నిర్వహించారు. .ఆసుపత్రి భవనాన్ని గత నెల 29న ప్రారంభించారు. ఈ భవనంలోకి మారే ముందు ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పూజలు చేశారు భవన నిర్మాణానికి సహకరించిన అధికారులను ఘనంగా సన్మానించారు.

ఆదర్శ ఉద్యోగులకు క్యాష్ అవార్డుల పంపిణీ

పీలేరు, మార్చి 18: ఉత్తమ పనితీరు కనబరిచిన ఆదర్శ ఉద్యోగులకు సోమవారం పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. డ్రైవర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన డీటీ రెడ్డికి రూ.500లు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇ.గోవిందుకు రూ.300లు, కండక్టర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.ఎస్.చంద్రకు రూ.500లు, ద్వితీయ స్థానం సాధించిన నిర్మలకు రూ.300లు, మెకానికల్ విభాగంలో ఎస్.కె.షరీఫ్‌కు రూ.500 నగదు ప్రోత్సాహకాలతోపాటు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్యారేజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

మదనపల్లె అర్బన్, మార్చి 18: పట్టణంలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియల్ పరీక్షలు సోమవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలను కేంద్రాలను మదనపల్లె డీవైఈవో శ్రీరాంపురుషోత్తం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును. పరిసరాలను ఆయన పరిశీలించారు.

వలసపల్లె సర్పంచ్ సరస్వతమ్మ మృతి

మదనపల్లె టౌన్, మార్చి 18: మదనపల్లె మండలం వలసపల్లె గ్రామ సర్పంచ్ జి. సరస్వతమ్మ(74) సోమవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందడంతో సహచర సర్పంచ్‌లు చిప్పిలి చలపతి, మహేష్, మాజీ ఎంపీటీసీ చెంగారెడ్డి సరస్వతమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించి ఆమె కుమారుడు నాగరాజరెడ్డిని పరామర్శించారు. ఆమె పదవీ కాలం ఇంకా రెండేళ్లు దాకా ఉండటంతో డీపీవో ఆదేశాల మేరకు ఉపసర్పంచ్‌కు కాని, పంచాయతీ సెక్రటరీకి కాని పంచాయతీ పాలనను అప్పగించనున్నట్లు సమాచారం.

గుండెపోటుతో ఏఎస్‌ఐ మృతి



.రెడ్డప్ప నాయక్ (ఫైల్‌ఫొటో)

తంబళ్లపల్లె, మార్చి 18: తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.రెడ్డప్ప నాయక్(51) ఆదివారం రాత్రి విధి నిర్వహణలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రెడ్డప్పనాయక్ కొన్ని నెలలుగా పీటీయం మండలం చెంద్రాయనిపల్లె సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి అస్వస్తతకు గురైనట్లు గమనించిన సిబ్బంది 108లో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏఎస్‌ఐ మరణ వార్తతో జిల్లాలోని పోలీసులు విచారం వ్యక్తం చేశారు. ఎస్‌ఐ శివకుమార్, స్థానిక పోలీసు సిబ్బంది, అధికారులు, స్థానికులు ఏఎస్‌ఐ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కుమార్, మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు తుమ్మశెట్టి మధు, ఎస్‌ఐలు శివకుమార్, చెన్నకేశవ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జిల్లా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జంగావారిపల్లె వద్ద ఆటో బోల్తా..

కురబలకోట, మార్చి 18: మండలంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె వద్ద ఆటో బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె నుంచి తంబళ్ళపల్లె మండలం కోటకొండకు సరుకులను తీసుకెళుతున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ బొమ్మల తొలగింపు

మదనపల్లె టౌన్, మార్చి 18: ఎన్నికల కోడ్ కూసినా తొలగని సీఎం జగన్ బొమ్మలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వార్తకు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అధికారులు స్పందించారు. సోమ వారం ఉదయమే ఎంపీడీవో భానుప్రసాద్, గ్రామ పం చాయ తీ కార్యదర్శులు, పోలీసులువెళ్లి సీటీఎం, ఆరోగ్యవరం, పోతబోలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలపై వున్న జగన్ బొమ్మలు కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. సీటీ ఎం క్రాస్‌రోడ్డు వద్ద ప్రైవేటు భవనంపై ఏర్పాటు చేసిన సిద్ధం బ్యానర్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఎం పీడీవో మాట్లాడుతూ ప్రైవేటు భవనాలు, వాహనాలపై రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచారం చేసుకోవా లంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని, లేకుంటే తొలగిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తొలగని వైసీపీ జండా....

నిమ్మనపల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రెండు రోజులు కావస్తున్నా సచివాలయాల ఎదుట ఏర్పాటు చేసిన వైసీపీ జండాలను అధికారుల తొలగిం చలేదు. వెంగంవారిపల్లి గ్రామ సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన వైసీపీ జెండా తో పాటు, డంపింగ్ యార్డులకు వేసిన వైసీపీ రంగులను తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెద్దతిప్పసముద్రం: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 24 గంటలు గడిచినాపలు గ్రామాల్లో ప్ర భుత్వ ఆస్తులపై సీఎం జగన్ ఫొటోలు కలిగిన పలు బ్యానర్‌లను తొలగించ లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా గ్రామస్థాయి అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. సోమవారం సాయంత్రమైనా మండలంలోని నవాబుకోట పంచాయతీ తాడిగవాండ్లపల్లె సమీపంలోని రోడ్డు సూచిక బోర్డుకు ఏర్పాటు చేసిన రాజశేఖర్‌రెడ్డి, జగనన్న, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డిలతో పాటు పీటీఎం మండల సింగల్ విండో ఛైర్మెన్ సుబ్రమణ్యంరెడ్డి ల ఫొటోలతో ఉన్న స్వాగతం బ్యానర్‌లు అలాగే కనిపిస్తున్నాయి. వీటిపై సంబందిత ఎంసీసీ(మోడల్ కోడ్ అఫ్ కాండాక్ట్) అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



మదనపల్లె: బ్యానర్‌ను తొలగించేందుకు వచ్చిన అధికారులు (ఎడమ)



వెంగంవారిపల్లిలో ఎగురుతున్న వైసీపీ జండా (పైన)

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



మదనపల్లె: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు



గుర్రంకొండ: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



నిమ్మనపల్లె: ఉర్దూ పాఠశాలలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, మార్చి 18: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు మదనపల్లె డీవైఈవో శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 52 పరీక్ష కేంద్రాల్లో 3, 380 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 3728 మంది మాత్రమే పరీక్షలు రాశారని డీవైఈవో చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతోపాటు, 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు.

గుర్రంకొండ: మండల కేంద్రంలోని తెలుగు హైస్కూల్‌లో 260 మందికి గాను ఆరుగురు, ఉర్దూ హైస్కూల్‌లో 104 మందికి గాను 15 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు. విద్యార్థు లు పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకున్నారు.

కలకడ: బాటవారిపల్లె పాఠశాలలో 207 మందికి గాను అందరూ, ఆదర్శ పాఠశాలలో 194 మందికి గాను 182 మంది, కోన హైస్కూల్‌లో 100 మందికిగాను 89 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో మునీంద్రనాయక్ తెలిపారు. కోన హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సీఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు.

నిమ్మనపల్లి:నిమ్మనపల్లిలోని జడ్పీ హైస్కూల్‌లో 256 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 232 మంది, ఉర్దూ పాఠశాలలో 87మందికి గానూ 84మంది హాజరైనట్లు చీఫ్ శ్రీనివాసులు. డీవో నాగేశ్వర్‌రావు తెలిపారు. మొత్తం మీద 27 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. ఉర్దూ పాఠశాలలో చీఫ్ రెడ్డెప్పరెడ్డి, డీవోగా బాబాజాన్ వ్యవహరించారు.

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో మూడు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా ఉదయం 8.30గంటలకే విద్యార్థులు చేరుకున్నారు. మొత్తం 692మంది విద్యార్థులకు గాను 640మంది హాజరు కాగా 45మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వెంకటరత్నం తెలిపారు.

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని హైస్కూల్ కేంద్రంలో 111 మంది విద్యార్థులకు గానూ 110 మంది హాజరు కాగగా, మోడల్‌స్కూల్ కేంద్రంలో 162 మందికి గానూ 151 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. "ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీలేరు: నిర్ణీత సమయానికి విద్యార్థులందరూ పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడలేదు. పీలేరు మండలంలో 9 పరీక్షా కేంద్రాలుండగా 1598 మంది పరీక్ష రాయాల్సి ఉంది. అయితే, 77 మంది గైర్హాజరయ్యారు. పీలేరు ఎస్‌ఐలు నరసింహుడు, రమణల బందోబస్తు ఏర్పాటు చేశారు.

బి కొత్తకోట: పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 861 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది. వీరిలో 41 మంది గైర్హాజరు అయ్యారు. అత్యధికంగా ఏపీ మోడల్‌స్కూల్ సెంటర్‌లో 33 మంది హాజరు కాలేదని ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు. సీఐ సూర్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్



పార్వతి

కురబలకోట, మార్చి 18: మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు డాక్టరేట్ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్ ఫారెన్ లాంగ్వేజస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పార్వతి ఏ కంపేరిటివ్ స్టడీ ఆఫ్ ది సెలెక్టెడ్ షార్ట్ ఫిక్షన్ ఆఫ్ ఆర్‌కే నారాయణ అండ్ విలియం ఫాల్కనర్ అనే అంశంపై చేసిన పరిశోధనకు తమిళనాడులోని ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కరెస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి సమీనా తదితరులు అభినందించారు.

రుయాలో మదనపల్లెవాసి మృతి

మదనపల్లె టౌన్, మార్చి 18: మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన రమణ(65) అనారోగ్యంతో తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతి చెందాడు. గత వారం రోజులుగా అక్కడ చికిత్స పొందుతున్న అతను పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. అతని వద్ద లభించిన వివరాల ఆధారంగా సిబ్బంది అలిపిరి పోలీసులకు సమాచారం అందించగా, వారు మదనపల్లె టు టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి బంధువులు, స్నేహితులు ఎవరైనా తెలిస్తే 99639 47718కు సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు.